సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 7 । జనవరి । 2025



అభయారణ్యంలో 'ఎకో' టూరిజం

కిన్నెరసాని అభయారణ్యంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టిన అటవీ శాఖ.. పర్యాటకులకు సౌకర్యాలూ కల్పించనుంది. 8లో



అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ

ఈ నెల 4, 5వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారు. 8లో

గరిష్టం / కనిష్టం

30° / 14°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

'భారజల' పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి

కర్మాగారం జీఎం జగ్గారావు



తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న జగ్గారావు

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం రక్షణ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని కర్మాగారం జీఎం జగ్గారావు అన్నారు. భారజల కర్మాగారం ఆధ్వర్యంలో గౌతమీనగర్ కాలనీ నుంచి అమెర్ద పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తాగునీటి సరఫరాను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారజల కర్మాగారం రక్షణ పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషు, భారజల కర్మాగారం అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

సరిహద్దు అడవుల్లో పెద్దపులి సంచారం

అప్రమత్తమైన జిల్లా అటవీ అధికారులు

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ జిల్లా గంగారం అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు అక్కడి అటవీ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రధానంగా గంగారం రేంజ్‌కు సరిహద్దున ఉన్న కొమరారం, కాచనపల్లి రేంజ్ అధికారులు సిబ్బందితో ప్రత్యేక బృందాలను నియమించి సోమవారం ఉదయం నుంచి గస్తీ ప్రారంభించారు. నీటి వనరులు ఉన్న చోట తనిఖీలు చేపడుతూ పాదముద్రల ఆనవాళ్లను పరిశీలిస్తున్నారు. మంగళవారం బృందాల సంఖ్య పెంచి సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ పెంచడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేస్తామని కొమరారం, కాచనపల్లి ఎఫ్ఆర్‌ఓలు ఉదయ్, చలపతిరావు తెలిపారు.


11 నుంచి టీసీసీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్ : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ) పరీక్షలు ఈనెల 11 నుంచి జరుగుతాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఉదయం 10 నుంచి 12.30, మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు ఉదయం 10 నుంచి 1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని వివరించారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో రెండు సెంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. డ్రాయింగ్ లోయర్ పరీక్షలు చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, డ్రాయింగ్ హయ్యర్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు బాబుక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని వెల్లడించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రం వద్దకు గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబోమని స్పష్టం చేశారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు పరీక్షల సహాయ కమిషనర్(99890 27943)ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గర్భిణుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

కొత్తగూడెంటౌన్: గర్భిణులు, పాలిచ్చే తల్లుల్లో లోప పోషణ నివారణకు పోషణ్ అభియాన్ సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని జిల్లా సంక్షేమశాఖాధికారి స్వర్ణలతా లెనినా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మహిళా శిశు, సంక్షేమశాఖ కార్యాలయంలో పోషణ్ అభియాన్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా మూడో తేదీలోపు పిల్లల ఎత్తు, బరువు వివరాలు సేకరించాలన్నారు. జిల్లా కోఆర్డినేటర్ పొనుగంటి సంపత్, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ బి.రాము, బ్లాక్ కో–ఆర్డినేటర్లు ఇందు, సోని, రాజ్యలక్ష్మి, రామకృష్ణ, శ్రీకాంత్, నాగిరెడ్డి, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కంచే చేను మేసె!



జిల్లా అటవీ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బందిలో కొందరి పనితీరు 'కంచే చేను మేసినట్టు' అనే నానుడిని నిజం చేస్తోంది. అడవుల్లోని చెట్లకు, వన్యప్రాణులకు నష్టం వాటిల్లినట్టు తెలుసుకున్న స్థానికులు, అటవీ శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం చేరవేస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా విచారణ చేసి నిందితులను పట్టుకుని కేసులు నమోదు చేయాల్సిన అటవీ సిబ్బంది ప్రైవేటు సెటిల్‌మెంట్లు చేస్తూ కాసులు దండుకుంటున్నారు. గడిచిన రెండు వారాల వ్యవధిలో ఈ తరహా ఘటనలు జిల్లాలో రెండు నమోదైనట్టు ప్రచారం జరుగుతోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

అటవీ శాఖలో ఇంటి దొంగల లీలలు

- అడవుల్లో అక్రమాలపై ఫిర్యాదులు
- కేసుల పేరుతో క్షేత్రస్థాయి సిబ్బంది బెదిరింపులు
- ప్రైవేట్ సెటిల్‌మెంట్ల కాసులతో కాలక్షేపం ?
- అవినీతికి పాల్పడేవారిపై చర్య తీసుకోవాలంటున్న స్థానికులు

'సింహ'భాగం పక్కదారి..

ఆళ్లపల్లి మండల పరిధిలో అక్రమ కలప రవాణాకు సంబంధించి పది దుంగలను అటవీ సిబ్బంది పట్టుకుని 2024 డిసెంబర్ 24న పాల్వంచలోని ప్రభుత్వ టింబర్ డిపోనకు తరలించారు. అయితే ఈ కేసులో పట్టుబడినవి కేవలం పది కాదని 30కి పైగా నాణ్యమైన దుంగలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. పోడు వ్యవసాయం చేసుకునే ఓ రైతుకు సాగు కలిసిరాక అప్పుల పాలయ్యాడు. దీంతో తన పొలంలో ఆరు టేకు చెట్లు నరకగా వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చేద్దామని భావించాడు. అయితే ఈ విషయం అటవీ శాఖకు తెలియడంతో వెంటనే క్షేత్రస్థాయి ఉద్యోగులు రంగంలోకి దిగారు. పది దుంగలను పట్టుకున్నట్టుగా లెక్కల్లో చూపారు. ఈ పదింటిలోనూ సగానికి పైగా ఫర్నిచర్ చేసేందుకు అనువుగా లేని వంకలు, కణుపులు, లోపల తొర్ర ఉన్నవి కావడం గమనార్హం. నాణ్యమైన దుంగలను లెక్కలో చూపకుండా పక్కదారి పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై విచారణ చేసి నిజానిజాలు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశంపై ఆళ్లపల్లి రేంజ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ వివరణ కోరగా... చింతకుంట నార్త్ బీట్ పరిధిలో వారం రోజుల క్రితం టేకు చెట్లు నరికిన విషయం తన దృష్టికి వచ్చిందని, అక్కడ పది దుంగలు లభించగా వాటిని పాల్వంచ టింబర్ డిపోనకు తరలించామని తెలిపారు. మిగిలిన దుంగల విషయం తన దృష్టికి రాలేదన్నారు.

విచారణ చేస్తున్నాం

డిసెంబర్ 25న అడవి గేదెను వేటాడిన విషయం నా దృష్టికి వచ్చింది. విచారణ అధికారిగా డీఆర్‌ఓ సుక్కిని నియమించాం. గంగారం అడవుల్లో పులి వచ్చినట్టు సమాచారం ఉండడంతో ప్రస్తుతం సిబ్బంది అంతా అటువైపు దృష్టి పెట్టారు. త్వరలోనే అడవి గేదె వేటకు సంబంధించి అన్ని విషయాలు తెలుసుకుంటాం.

– చలపతిరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కాచనపల్లి

వేటగాళ్లపై లంచం వల..

కాచనపల్లి రేంజ్ పరిధిలో అడవి సమీపంలో ఉన్న పొలం గట్టు వెంట కొందరు వేటగాళ్లు ఉచ్చులు అమర్చారు. ఈ ఉచ్చులో పొరపాటున ఓ అడవి గేదె చిక్కుకుంది. వెంటనే అప్రమత్తమైన వేటగాళ్లు దాన్ని చంపి మాంసాన్ని పోగులు వేసి విక్రయానికి పెట్టారు. పోగుల పంపకంలో తేడాలు రావడంతో కొందరు ఈ సమాచారాన్ని క్షేత్రస్థాయి సిబ్బందికి చేరవేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఓ అటవీ శాఖ ఉద్యోగి సదరు వేటగాళ్లను, అడవి గేదె మాంసాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. ఇక్కడే కథలో మలుపు చోటు చేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కేసు నమోదు చేయాల్సిన సదరు ఉద్యోగి.. 'అడవి జంతువులను వేటాడం, వాటి మాంసాన్ని విక్రయించడం తీవ్ర నేరం, కేసులు నమోదైతే జీవితాలు ఆగమవుతాయి' అంటూ వేటగాళ్లను తీవ్రంగా బెదిరించినట్టు తెలుస్తోంది. తనకు రూ.1.50 లక్షలు ముట్టజెబితే కేసులేమీ లేకుండా చూసుకుంటానని, లేదంటే మీ గతి అంతే అంటూ తీవ్రంగా బెదిరించినట్టు ప్రచారం జరుగుతోంది. 'డబ్బులు లేకే మేము అప్పుడప్పుడు అటవీ జంతువులను వేటాడుతున్నామని, మీరు కోరినంత ఇచ్చుకోలేమని, మాపై దయ చూపాలని' వేటగాళ్ల బృందం వేడుకోగా చివరకు రూ.90 వేల దగ్గర డీల్ సెటిల్ అయినట్టు సమాచారం. అసలే నిరుపేదలైన ఆ వేటగాళ్లు అటవీ సిబ్బంది వేధింపులతో మరింతగా అప్పుల్లోకి కూరుకుపోయారు. దీంతో ఈ విషయం ఆ నోటా ఈ నోటా బయటకు పొక్కి, చివరకు జిల్లా కేంద్రానికి చేరుకుంది.

రమణీయం.. రామావతారం

- నిజరూపంలో స్వామివారి అలంకరణ
- నేడు బలరామావతారంలో దర్శనం



స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న భక్తులు, అర్చకులు

భద్రాచలం: చక్కని సీతమ్మ ఒడిలో, పక్కన సోదరుడు లక్ష్మణుడు, రెండు చేతుల్లో శంఖుచక్రాలు, మరో రెండు చేతుల్లో ధనుర్బాణాలను ధరించి లోక రక్షణకు నేనున్నానంటూ భక్తులకు అభయమిస్తూ దర్శనమిచ్చారు భద్రాద్రి రామయ్య. ఆదర్శ పురుషుడు, ఏకపత్నీవ్రతుడైన రామవతారాన్ని చూసి తరించిన భక్తులు రమణీయమని కొనియాడారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న ముక్కోటి ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం నిజరూపంలో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయం ఆరాధన గావించి, బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులతో పాటు 12 మంది ఆళ్వార్లను కొలువుదీర్చారు. వేదపండితులు 200 పాశురాలను పఠించారు. అనంతరం స్వామివారిని భక్తుల శ్రీరామనామస్మరణల నడుమ ప్రత్యేక పల్లకీలో ఉంచి వేదపండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మహిళల కోలాటాల నడుమ మిథిలా స్టేడియంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపైకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. ఈ సందర్భంగా భక్తులు నిజరూపంలో ఉన్న రామయ్యను దర్శించుకుని పులకించిపోయారు. వ్యక్తిగత సౌఖ్యాలకన్నా ధర్మాచరణయే ఉత్తమ మైనదని, అదే శాశ్వతమైనదని శ్రీరాముడు లోకానికి చాటి చెప్పాడని, పరిపూర్ణమైన మానవుడు ఎలా ఉండాలో ఆచరించి చూపించిన ఆదర్శ పురుషుడు, మర్యాద పురుషోత్తముడు, ధర్మ స్వరూపుడు రాముడేనని ఆలయ అర్చకులు, పండితులు రామావతార విశిష్టతను వివరించారు.

భక్తులకు 2 లక్షల లడ్డూలు..

తెప్పోత్సవం, ముక్కోటికి వచ్చే భక్తులకు దేవస్థానం. ఆధ్వర్యంలో ప్రసాదాలను ముందస్తుగా తయారు చేస్తున్నారు. సీఆర్‌ఓ కార్యాలయం పై భాగంలో ప్రత్యేకంగా నియమించిన కార్మికులతో లడ్డూలు తయారవుతున్నాయి. భక్తుల రద్దీని బట్టి సుమారు 2 లక్షల లడ్డూల వరకు సిద్ధం చేయనున్నారు. అలాగే ఉత్తర ద్వారం వద్ద స్టేడియం ఎదురుగా వీవీఐపీలు, వీఐపీలు, భక్తులు కూర్చునేందుకు సెక్టార్ల విభజన జరిగింది. తెప్పోత్సవం జరిగే హంస వాహనం ట్రయల్ రన్‌ను సైతం అధికారులు పూర్తి చేశారు. మరో సారి ట్రయల్ రన్ అనంతరం విద్యుత్ దీపాలను అలంకరిస్తారు.

నేడు బలరామావతారంలో దర్శనం..

శ్రీహరికి శయనమైన ఆదిశేషుని అంశతో జన్మించి.. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న నానుడికి ప్రతీకగా నాగలిని ఆయుధంగా ధరించి శ్రీకృష్ణుడికి అన్నగా నిలిచి, ఆయనకు ధర్మ స్థాపనలో సహకరించిన అవతారం శ్రీ బలరామావతారం. సంకర్షణునిగా పిలవబడే బలరాముడు ప్రలంబాసురడనే రాక్షసుని సంహరించాడు. ఈ అవతారాన్ని దర్శించిన వారికి మాందిగూళికా గ్రహాల బాధలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. అధ్యయనోత్సవాలలో భాగంగా స్వామి వారు మంగళవారం బలరామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

జిల్లా ఓటర్లు 9,95,150 మంది

తుది జాబితా విడుదల చేసిన అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ఓటర్ల తుది జాబితా వివరాలను అధికారులు సోమవారం వెల్లడించారు. జిల్లాలో 9,95,150 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 4,81,985 మంది పురుషులు, 5,12,364 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు 64 మంది ఉన్నారు. ఇక సర్వీస్ ఓటర్లు 737 మంది ఉన్నారు. జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 30,379 మంది ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో 2024 అక్టోబర్ 29 నాటికి 9,91,114 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇటీవల కొత్తగా 7,680 మంది ఓటర్లను చేర్చగా, 4,381 మంది ఓట్లను పరిశీలించి తొలగించారు. దీంతో 2025 జనవరి 6 వరకు 9,94,413 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. వీరికి సర్వీస్ ఓటర్ల సంఖ్య 737 కలిపితే మొత్తం 9,95,150కు చేరింది.

నియోజకవర్గాల వారీగా ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
కొత్తగూడెం	1,19,708	1,28,488	39	155	2,48,390
ఇల్లెందు	1,10,480	1,16,057	3	275	2,26,815
భద్రాచలం	73,579	80,491	10	54	1,54,134
పినపాక	1,00,279	1,04,694	5	204	2,05,182
అశ్వారావుపేట	77,939	82,634	7	49	1,60,629
మొత్తం	4,81,985	5,12,364	64	737	9,95,150

ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి పెట్టండి

అదనపు కలెక్టర్ విద్యాచందన



ప్రజావాణిలో సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ విద్యాచందన, ఏఓ రమాదేవి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రమాదేవితో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల్లో కొన్ని..

- కొత్తగూడెం మున్సిపాలిటీ మధురబస్తీలో నివాసం ఉంటున్న ఎంఏ రియాజ్ విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద చేసిన దరఖాస్తు నెల రోజులు దాటినప్పటికీ ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, పారదర్శకతతో సమాచారం ఇప్పించాలని చేసిన దరఖాస్తును సీ సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.
- సుజాతనగర్ మండలం లక్ష్మీపురం తండాలో నివాసం ఉంటున్న బోడ రామ అనే రైతు.. ఆర్ఓఎఫ్ఆర్ అటవీ హక్కుల పట్టా పాసు పుస్తకం కలిగి ఉన్నానని, తనకు ఉన్న ఎకరం 30 గుంటల వ్యవసాయ భూమిలో ఉపాధిహామీ పథకం ద్వారా 20 సంవత్సరాల క్రితం టేకుచెట్లు వేశామని, అవి పెద్దగా పెరగడంతో పంటలు దిగిబడి రావడం లేదని, ఉన్న 30 చెట్లను నరికి అమ్ముకోవడానికి అనుమతి ఇప్పించాలని చేసిన దరఖాస్తును ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.
- ఇల్లెందు మండలం మామిడిగుండాలకు చెందిన రామ్మోహనరావు.. గ్రామంలో సర్వే నంబర్లు 130/2డీ/5/1, 105/3, 80, 81, 130/2డీ/5/3లో ఉన్న వారసత్వ భూమిలో కొందరు అక్రమంగా బోర్లు వేస్తున్నారని, వాటిని నిలిపివేయించాలని దరఖాస్తు చేయగా ఇల్లెందు తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

అందరినీ మెప్పించేలా ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మిథిలా స్టేడియం వేదిక వద్ద స్వామివారిని దర్శించుకుంటున్న కలెక్టర్ పాటిల్, ఎస్పీ, ఈఓ

భద్రాచలం : ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలానికి వచ్చే భక్తులు, పర్యాటకులను మెప్పించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. తొలుత సబ్ కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ముక్కోటి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మిథిలా స్టేడియం, ఉత్తర ద్వార దర్శనం వద్ద సెక్టార్ పనులను, గోదావరి తీరం వద్ద ముక్కోటి, క్యాంప్ సైట్ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీవీఐపీ, వీఐపీలకు వేర్వేరుగా బారికేడ్లతో పాటు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. స్నానాల ఘాట్, పార్కింగ్ ప్రదేశాల వరకు విద్యుత్‌దీపాలు అమర్చాలని, తొక్కిసలాట జరగకుండా ఆలయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తాగునీటి సౌకర్యం, ఇతర వసతులు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు, పోలీస్ సిబ్బంది వారి కుటుంబసభ్యులు, బంధువుల కోసం కాకుండా భక్తులకు దర్శనం కల్పించేలా పనిచేయాలని అన్నారు. మిగిలిన పనులన్నీ మంగళవారం నాటికి పూర్తి కావాలని ఆదేశించారు. భక్తుల కోసం వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. 9, 10 తేదీల్లో మద్యం దుకాణాలను పూర్తిగా బంద్ చేయించాలని సూచించారు. ఈ ఏడాది ఏరు ఉత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన స్టాళ్లు, వంటకాలకు ఆదరణ వచ్చేలా ప్రచారం చేయాలని చెప్పారు. భక్తులు భద్రాచలంలోని క్యాంప్ సైట్‌లో విడిది చేసిన తర్వాత కిన్నెరసాని, బొజ్జిగుప్ప, బెండాలపాడు, ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు మిథిలా స్టేడియంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఆర్‌డీఓ విద్యాచందన, ఆలయ ఈఓ రమాదేవి, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

భద్రాచలంఅర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించగా, కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్యక్రమం చేపట్టిన స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని అన్నారు. అంధత్వ నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇలాంటి వైద్య శిబిరాలకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ ఎనిమియా, తలసేమియా ఎక్కువగా ఉందని, వాటికి చికిత్స అందించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, డీసీహెచ్ఎస్ రవిబాబు, భద్రాచలం ఏఎంసీ వెంకటపుల్లయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, సంతోష్, ప్రోగ్రాం చైర్మన్ ఎస్.ఎల్.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ సిబ్బంది సేవలు మరువలేనివి

కొత్తగూడెంరూరల్: నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని, ఆ సిబ్బంది సేవలు మరువలేనివని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన హెడ్ నర్సులకు సోమవారం ఐఎంఏ హాల్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా పేషంట్లకు చికిత్స అందించడమే లక్ష్యంగా సేవలు అందిస్తున్న నర్సులను ప్రశంసించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రవిబాబు, టీవీవీపీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రామకృష్ణ, రాంప్రసాద్, రాధారుక్మిణి, సునీల్ మజ్జేకర్, హర్షవర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాధామోహన్ పాల్గొన్నారు.

కాటేజీల పనులు ఇంకెన్నాళ్లు..



కిన్నెరసానిలో గెస్ట్‌హౌస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. కేటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లతోపాటు అసంపూర్తిగా ఉన్న ఫుడ్ కోర్టును పరిశీలించారు. ముక్కోటి సందర్భంగా వచ్చే భక్తులు, పర్యాటకులకు కిన్నెరసానిలో కల్పించాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఎంతమంది వచ్చినా అసౌకర్యం కలగకుండా గెస్ట్‌హౌస్‌లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కిన్నెరసాని గుట్టపై ఉన్న కాటేజీలు, ఇల్లెందు క్రాస్‌రోడ్డులోని హరిత హోటల్ పనులు ఎప్పటికి పూర్తవుతాయని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆరా తీశారు. త్వరగా పూర్తి చేసి అప్పగించాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఎం రాంబాబు, సీసీ రవి ఉన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి



బూర్గంపాడు కళాశాలలో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి

బూర్గంపాడు/అశ్వాపురం/పినపాక : ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి సూచించారు. డీఐఈఓ హెచ్. వెంకటేశ్వరరావుతో కలిసి సోమవారం ఆయన బూర్గంపాడు, అశ్వాపురం, పినపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతం, ప్రగతి నివేదికలతో పాటు అధ్యాపకుల బోధన తీరును, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సిలబస్ త్వరగా పూర్తిచేసి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని లేకుంటే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ తర్వాత విద్యార్థులతో మాట్లాడి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాయుతంగా చదువుకోవాలని సూచించారు. అశ్వాపురం కళాశాలకు చెందిన ఎస్‌కే అమ్రీన్ ఇటీవల సీఎం కప్‌లో జావెలిన్‌త్రోలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా యాదగిరి అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు చీన్యా, శేషుబాబు, సత్యనారాయణ, అధ్యాపకులు నాగేశ్వరరావు, శ్రీనివాస్, ముకుందం, సత్యేంద్రకుమార్, మూర్తి, నరేష్, లక్ష్మీదీపిక, సాహితి, జరీనా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

- 12 మంది జాతీయ పోటీలకు ఎంపిక



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

టేకులపల్లి: నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30–100 వయసు గ్రూపు క్రీడాకారులకు ఈ నెల 4,5 తేదీల్లో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూక్య మంజీలాల్, ప్రధాన కార్యదర్శి నాగలక్ష్మి సోమవారం వివరాలు వెల్లడించారు. అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1000 మంది హాజరయ్యారు. జిల్లా నుంచి 78 మంది క్రీడాకారులు హాజరుకాగా 40 మంది వివిధ అంశాల్లో సత్తా చాటి 80 పతకాలు సాధించారు. 12 మంది ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 4 వరకు కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను క్రీడా సంఘాల బాధ్యులు నరేష్, మహీధర్, ప్రేమ్ తదితరులు అభినందించారు.

కానిస్టేబుల్‌కు మూడు పతకాలు...



పతకాలతో వీరభద్రం

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన కానిస్టేబుల్ పి.వీరభద్రం ప్రతిభ కనబర్చి మూడు పతకాలు సాధించారు. 50 ఏళ్ల పైబడిన వారితో ఆదివారం నిర్వహించిన పోటీల్లో ఓపెన్ కేటగిరీలో పాల్గొన్నానని, 1500 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం, ఐదు కిలోమీటర్లు, 400 మీటర్ల పరుగు పందేల్లో రజిత పతకాలు సాధించానని సోమవారం ఆయన 'సాక్షి'కి తెలిపారు. కాగా, ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యానని చెప్పారు. తాను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించిన ఆర్ఐ సుధాకర్, సీఐ శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆళ్లపల్లిలో ఆటవిక న్యాయం

- వివాహేతర సంబంధం నేపథ్యాన గొడవ
- వాలీబాల్ కోర్టు స్తంభాలకు కట్టేసి కొట్టిన వైనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆళ్లపల్లి మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం రాత్రి పలువురు ఆటవిక న్యాయాన్ని అమలు జరిపారు. మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన స్త్రీ, పురుషుడికి ఇప్పటికే వివాహాలు జరగగా కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ అంశంపై పలుమార్లు పంచాయితీ నిర్వహించినా వారిలో మార్పు రాలేదు. ఆదివారం రాత్రి ఇద్దరూ కలిసి ఉండగా గ్రామస్తులు పట్టుకున్నారు. ఆపై గ్రామంలోని వాలీబాల్ కోర్టులో చెరో స్తంభానికి తాళ్లతో కట్టేసి తీవ్రంగా కొట్టారు. ఈ దెబ్బలకు తాళలేక రక్తమోడుతున్న శరీరాలతో వారిద్దరు విలవిల్లాడారు. చివరకు గ్రామ పెద్దలు జోక్యం చేసుకోవడంతో అర్ధరాత్రి దాటాక ఇద్దరినీ మందలించి వదిలేశారు. సకాలంలో గ్రామ పెద్దలు జోక్యం చేసుకోకుంటే వారిద్దరి ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని స్థానికుల ద్వారా తెలిసింది. ఈ అంశంపై ఇరువర్గాల వారూ పోలీసులను సంప్రదించలేదు. కాగా, తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కొత్తగూడెంలోని ఓ ఆస్పత్రికి తరలించినట్టు సమాచారం.

విజయవంతంగా శస్త్రచికిత్స

- కడుపులో 12 గడ్డలు తొలగింపు



శస్త్ర చికిత్స చేసి తొలగించిన గడ్డలు

కొత్తగూడెంరూరల్: పాల్వంచకు చెందిన ఓ మహిళ (45) తీవ్రమైన కడుపునొప్పి, రక్తస్రావంతో ఆదివారం కొత్తగూడెంలోని డాక్టర్ బిందు పల్లవిని సంప్రదించారు. పరీక్షించిన వైద్యురాలు గర్భసంచి చుట్టూ 12 గడ్డలు ఉన్నట్టు గుర్తించారు. క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి చేసి ప్రాణాలను కాపాడారు. తన ఆస్పత్రిలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించిన డాక్టర్‌ను పలువురు అభినందించారు.

ఇద్దరిపై బైండోవర్ కేసు

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దార్లగూడెం గ్రామానికి చెందిన కోడి కత్తులు తయారు చేసి విక్రయించే కారం చలపతి, కారం కన్నప్ప రాజులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ మేరకు సీఐ అశోక్ సోమవారం వివరాలు వెల్లడించారు. కొలిమి ద్వారా వ్యవసాయ పనుల్లో వినియోగించే గొడ్డలి, కొడవళ్లు తయారు చేసే వీరు కోడి పందేల నిర్వాహకుల డిమాండ్ ప్రకారం కోడి కత్తులు తయారు చేస్తుండగా అరెస్ట్ చేశారు. 15 కత్తులను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ ఎదుట సంవత్సరం కాలానికి రూ.లక్ష మొత్తానికి బైండోవర్ చేశారు. వారం రోజుల క్రితం ఇదే సరిహద్దు ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్న 25 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 15 బైక్‌లను, రూ.11,110 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.



అభయారణ్యంలో ఎకో టూరిజం

ప్రతిపాదనలు పంపాం



ఇక్కడి వనరులను పర్యావరణహితంగా ఉపయోగించుకునేందుకు ఎకో టూరి జం అభివృద్ధి పనులు చేపడతాం. అన్ని అంశాలపై సర్వే చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అభయారణ్యాన్ని సందర్శించే ఔత్సాహికుల అభిరుచి మేరకు సైక్లింగ్, ట్రెక్కింగ్ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తాం. వన్యప్రాణులను ప్రత్యక్షంగా వీక్షించేలా కిన్నెరసాని డీర్‌పార్కు నుంచి చింతోనిచెలక మీదుగా రంగాపురం, సిద్దారం, రంగాపురం వరకు సఫారీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నాం.

–కృష్ణాగౌడ్, జిల్లా అటవీశాఖాధికారి

కిన్నెరసాని దశ మారేనా?

- ప్రకృతి అందాలకు నిలయం
- మినీ ఊటీని తలపించే పర్యాటక ప్రాంతం
- ఆకట్టుకునే చుక్కల దుప్పులు, జలాశయంలో బోటుషికారు



అద్దాలమేడ

పాల్వంచరూరల్: ఎకో టూరిజం ద్వారా కిన్నెరసాని అభయారణ్యం దిశ మారుతుందని తెలుస్తోంది. ములుగు జిల్లాలో ఎకో టూరిజం ద్వారా అభివృద్ధి పరిచిన, పర్యాటకులను ఆకట్టుకునే బ్లాక్‌బెర్రి, హైలాండ్, ఓపెన్ రెస్టారెంట్లు, సెల్ఫీ పాయింట్లు ఉన్నాయి. ఇక్కడ మాత్రం కొత్తగా ఇంకా పర్యాటకులను ఆకర్షించే అభివృద్ధి కనిపించడంలేదు. కిన్నెరసానిలో అడుగడుగునా ఆహ్లాదాన్ని పంచే జీవవైవిధ్యం కలిగిన అందాలు, కనుచూపు మేరలో విస్తరించిన ప్రకృతి రమణీయత మినీ ఊటిని తలపించేలా ఉంటుంది. పచ్చని చెట్లు, జలాశయం, వన్యప్రాణులతో చూడచక్కని ప్రకృతి అందాలకు నిలయమైన కిన్నెరసానిలో ఎత్తయిన కొండలు, గుట్టలు, ద్వీపాలు, పచ్చిక బయళ్లు ఉన్నాయి. పర్యాటకుల ఊహకు ఏమాత్రం తగ్గని రీతిలో ఇక్కడి ప్రకృతి సోయగాలు అలరిస్తాయి. ఆ సోయగాలను ఆస్వాదించేందుకు కిన్నెరసానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించడంతో జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యంలో ఎకో టూరిజం అభివృద్ధికి అటవీ శాఖ ప్రణాళికలు రూపొందించింది. ప్రకృతి అందాలను తిలకించేవారికి ప్రత్యేక సౌకర్యాల కల్పనపై దృష్టి సారించింది.

1977లో ఏర్పాటైన అభయారణ్యం

పాల్వంచ కేంద్రంలో 1977 జనవరి 24 కిన్నెరసానిని కేంద్ర ప్రభుత్వం అభయారణ్యంగా ఏర్పాటు చేసింది. 634.4 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్న అభయారణ్యంలో వైల్డ్‌లైఫ్ డివిజన్ కేంద్రం పాల్వంచ పట్టణంలో ఉంది. అభయారణ్యం చుట్టూ నలుదిక్కులా ఎత్తయిన కొండలు, పచ్చని చెట్లు, 408 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయం, రిజర్వాయర్ మధ్యలో ఆకట్టుకునే నాలుగు ఐలాండ్స్ (ద్వీపాలు) ఉన్నాయి. వీటిలో రెండు ద్వీపాలను అనుసంధానం చేస్తూ లక్నవరం లో మాదిరిగా తీగల వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది. జలాశయాన్ని ఆనుకుని గుట్టపైన 9 కాటేజీలు, రెండు అంతస్తుల అద్దాలమేడ నిర్మించారు. కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తే పర్యాటకులు ఏడాది పొడవునా పోటెత్తుతారు.

ఆకర్షించేలా కాటేజీల నిర్మాణం

2015లో నీతి అయోగ్ పథకం కింద కేంద్రం ద్వారా రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేశాయి. అయితే ఆయా నిధులతో కిన్నెరసానిలో తొమ్మిది కాటేజీలు, అద్దాలమేడ పనులు పూర్తికావొచ్చాయి. ఒక్క ఫుడ్‌కోర్టు పనులు మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి. కిన్నెరసాని రిజర్వాయర్‌లో రెండు బోట్లు ఉన్నాయి. కిన్నెరసానిని ఒకసారి సందర్శించిన పర్యాటకులు మరోసారి వచ్చేందుకు కూడా ఉత్సాహం చూపుతున్నారు.

అడ్డంకిగా వైల్డ్‌లైఫ్ చట్టం

పర్యాటకుల వాహనాలు కాటేజీలు, అద్దాలమేడ వరకు వెళ్లే విధంగా కొంతదూరం సీసీరోడ్డును నిర్మించగా మిగిలిన రహదారి అధ్వానంగా మారింది. కంకరతేలి వాహన రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారిని సీసీరోడ్డుతో నిర్మించాలని టూరిజం శాఖ ఇంజనీర్ వైల్డ్‌లైఫ్ శాఖకు ప్రతిపాదనలు పంపగా వైల్డ్‌లైఫ్ చట్టం ప్రకారం సీసీ రోడ్డుకు అనుమతులు ఇవ్వకుండా నిలిపివేశారు. రోడ్డును నిర్మిస్తే పర్యాటకులకు సౌకర్యంగా ఉంటుంది.

తాడ్వాయి బ్లాక్ బ్రెరీ మాదిరిగా అభివృద్ధి చేయాలి..



ములుగు జిల్లా తాడ్వాయిలో ఆధునిక గుడారాలు

ములుగు జిల్లా తాడ్వాయి సమీపంలో బ్లాక్‌బ్రెరీ దీవిని ఆహ్లాదంగా ఉండేలా తీర్చిదిద్దారు. అక్కడ పగలంతా ఒకరకంగా రాత్రి సమయంలో పర్యాటకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేశారు. స్వాగత ద్వారం, రెస్టారెంట్లు, ఆధునిక గుడారాలు, సోలార్ దీపాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. అదే మాదిరిగా కిన్నెరసాని జలాశయంలోని రెండు ద్వీపాల నడుమ తీగల వంతెన ఏర్పాటు చేసి, ప్రత్యేక హోటళ్లను, వసతి గృహాలను నిర్మాణం చేయాలి. ఇటీవల ఫారెస్ట్ అధికారులతో కలిసి కిన్నెరసాని జలాశయం ఐలాండ్‌లో సౌకర్యాల ఏర్పాటును కూడా కలెక్టర్ పరిశీలించారు.

స్మైల్ ప్లీజ్!



గిరిజన మ్యూజియం వద్ద పీఓ రాహుల్

భద్రాచలం: రానున్న ముక్కోటికి భద్రాచలం వచ్చే భక్తులు, పర్యాటకులను ఆకట్టుకునేలా గోదావరి తీరంతో పాటు ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఇందులో భాగంగా పలు చోట్ల సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈమేరకు సోమవారం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ విక్రాంత్ సింగ్ తదితరులు సరదాగా సెల్ఫీలు దిగడంతో పాటు అధికారుల సాయంతో ఫొటోలు సైతం దిగారు. ధృంగా ప్రీ వెడ్డింగ్ షూట్ల నిర్వహణకు సైతం ఈ ప్రాంతాలు అనువుగా ఉన్నాయని అధికారులు చమత్కరించారు.



గోదావరి తీరం వద్ద కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్, ఏఎస్పీ విక్రాంత్

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓ పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, రూ.1500 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. స్థావరం నుంచి పారిపోయిన మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎస్సై టీ యయాతి రాజు తెలిపారు.

జోరుగా జీరో దందా

- అనుమతిలేని వ్యాపారులకు మార్కెట్ అధికారుల నోటీసులు
- ఓ వ్యాపారి నుంచి రూ.5.40 లక్షల మార్కెట్ ఫీజు వసూలు



మార్కెట్ కార్యాలయం

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలో పలువురు వ్యాపారులు మార్కెట్ ఫీజు చెల్లించకుండా జీరో దందా సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం 'సాక్షి'లో 'అధికారులను బురిడీ కొట్టించిన వ్యాపారి..?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో మార్కెట్ కార్యదర్శి ఇ.నరేష్ తదితరులు స్పందించి ఇల్లెందు మండలం ముకుందాపురానికి చెందిన శ్రీ బాలాజీ ట్రేడర్స్ నుంచి రూ. 5.40 లక్షలు వసూళ్లు చేశారు. ఒక్క వ్యాపారి నుంచి ఫీజు వసూలు చేస్తేనే ఇంత వచ్చిందని, మిగతా వ్యాపారుల నుంచి కూడా ఫీజు వసూలు చేస్తే మార్కెట్‌కు దండిగా ఆదాయం వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇల్లెందు మార్కెట్ వార్షిక ఆదాయ లక్ష్యం రూ.4.64 కోట్లు కాగా ఇప్పటివరకు రూ. 3.60 కోట్లు సమకూరింది. మరో రెండు నెలల్లో టార్గెట్ పూర్తి చేయాల్సి ఉంది. లక్ష్యం చేరేందుకు మూడు నెలలుగా అధికారులు మార్కెట్ పరిధిలోని 8 మండలాల్లో క్రయవిక్రయాలను పరిశీలించారు. అనుమతి లేని, ఉన్న వ్యాపారుల నుంచి ఫీజు వసూలు చేస్తే సుమారు రూ. 10 కోట్ల ఆదాయం లభించే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది. కాగా ఫీజు ఎగ్గొడుతున్న వ్యాపారులకు మార్కెట్ చెక్ పోస్టుల్లో పని చేసే గార్డులు, సిబ్బంది సహకరిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మార్కెట్ గార్డులను కొనసాగించే ఏజెన్సీతో సమావేశం నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న గార్డులను తొలగించాలని మార్కెట్ పాలకవర్గం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

గ్రామాల్లో జీరో వ్యాపారం



గ్రామాల్లో జీరో వ్యాపారం చేస్తున్నట్లు మా పరిశీలనలో తేలింది. వ్యాపారులందరికీ నోటీసులు ఇస్తున్నాం. రైతులను నష్టపర్చడంతోపాటు మార్కెట్‌కు ఆదాయం రాకుండా చేస్తున్నారు. అందరి నుంచి ఫీజు వసూలు చేస్తాం

–నరేష్, ఇల్లెందు మార్కెట్ కార్యదర్శి

బ్రెయిన్ స్ట్రోక్‌తో రెవెన్యూ ఉద్యోగి మృతి



ఎస్కే జాకీర్(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెవెన్యూ శాఖ ఉద్యోగి ఒకరు ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబీకుల కథనం ప్రకారం .. అశ్వారావుపేటలోని ఫైర్ కాలనీకి చెందిన ఎస్కే జాకీర్(44) స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆఫీస్ సబ్ ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురి కాగా, కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సివిల్ సప్లై డీటీ ప్రభాకర్ మృతదేహాన్ని సందర్శించి తక్షణ సహాయంగా రూ.30 వేల నగదు అందించారు. తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీరా రాంరావి, టి.వెంకన్న తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పురుగుల మందు తాగిన యువకుడు...




సతీష్ కుమార్ (ఫైల్)

కరకగూడెం: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రేగళ్ల గ్రామానికి చెందిన పాయం సతీష్ కుమార్(28) మద్యం మత్తులో శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరకగూడెం ఎస్సై రాజేందర్ తెలిపారు. శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.

కాపర్ దొంగల అరెస్ట్

రెండు ఆటోలు, 15 కేజీల రాగి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: నలుగురు కాపర్ దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ టీ.రమేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. పెనగడప శివారులోని చంద్రుగొండ క్రాస్‌రోడ్డు వద్ద అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, రామవరం సీఆర్పీ క్యాంప్‌నకు చెందిన దీపక్ పాసీ, వెంగళరావుకాలనీ 4 ఇంక్‌లైన్‌కు చెందిన చెందిన బోధనపు సులేమాన్, రామవరం 7 నెంబర్ బజార్‌కు చెందిన గట్టు కిరణ్‌కుమార్‌లుగా తేలింది. వీరితోపాటు మరో వ్యక్తి కూడా ఉన్నాడు. సుజాతనగర్, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, టేకులపల్లి, మండలాల్లోని పంటపొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ చోరీ చేసినట్లు విచారణలో అంగీకరించారు. నిందితుల నుంచి రెండు ఆటోలు, 15 కేజీల రాగి స్వాధీనం చేసుకున్నారు. వీరితోపాటు దొంగతనానికి వెళ్లిన తమ్మా నిరంజన్ ట్రాన్స్‌ఫార్మర్ షాక్ కొట్టడంతో మృతి చెందాడు. అతన్ని ఆస్పత్రిలో చేర్పించి పరారై, పోలీసులకు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితులను కోర్టులో రిమాండ్ చేశామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ శ్రీనివాస పాల్గొన్నారు.

ముక్కోటి ఉత్సవాల్లో 9 ప్రథమ చికిత్స కేంద్రాలు..

భద్రాచలంఅర్బన్: శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయంలో ఈ నెల 8,9,10 వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం భద్రాచలంలో 7 ప్రథమ చికిత్సా కేంద్రాలు, పర్ణశాలలో రెండు ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చైతన్య సోమవారం తెలిపారు. కాగా హ్యూమన్ మెటనిమో వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

108 వాహనాల తనిఖీ



కేసుల వివరాలు పరిశీలిస్తున్న మేనేజర్ నాగేందర్

దమ్మపేట/సత్తుపల్లి రూరల్: దమ్మపేట, సత్తుపల్లిలో 108 అంబులెన్స్ వాహనాలను ఉమ్మడి జిల్లా మేనేజర్ భూమా నాగేందర్ సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంబులెన్స్‌ల్లో పరికరాల పనితీరు, రికార్డుల నిర్వహణను పరి శీలించిన ఆయన రికార్డుల్లో వివరాలను తనిఖీ చేశారు. ఫోన్ రగానే సకాలంలో బాధితుల వద్దకు చేరడం ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవచ్చని తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు సాకిరి రమేష్, అప్పారావు, పైలట్లు లాల్‌సింగ్, ఏకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో పంచాయతీల విలీనంపై నిరసన



ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీల ప్రజలు

సుజాతనగర్: మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య మాట్లాడుతూ సుజాతనగర్ మండలం ఇంకా గ్రామీణ ప్రాంతంగానే ఉందని అన్నారు. కార్పొరేషన్‌లో గ్రామాల విలీనం మూలంగా ఉపాధి హామీ చట్టం వర్తించదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ప్రభావంతో ఇంటి పన్నులు, పంపు బిల్లులు, పెరుగుతాయని, చెత్త పన్ను విధిస్తారని, రైతుల సబ్సిడీలు రద్దవుతాయని తెలిపారు. చిరు వ్యాపారులు దెబ్బతింటారని పేర్కొన్నారు. శాస్త్రీయత లేకుండా సుజాతనగర్ మండలంలోని 7 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించకుండా, ప్రజాభిప్రాయ సేకరణ కూడా లేకుండా ఏకపక్షంగా కార్పొరేషన్‌లో పంచాయతీలను కలపడం బాధాకరమని అన్నారు. కార్పొరేషన్ రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ నెల 20న కలెక్టరేట్ వద్ద రెండు వేల మందితో ధర్నా నిర్వహిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ శిరీషకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కున్సోత్ ధర్మా, మండల కార్యదర్శి వీర్ల రమేష్, నాయకులు బచ్చలకూర శ్రీని వాస్, కొండె కృష్ణ, నల్లగోపు పుల్లయ్య, మద్దెల శ్రీలక్ష్మి, సోలం నాగరత్నమ్మ, భూక్య శంకర్ పాల్గొన్నారు.

28.8 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

కారేపల్లి: ఒక లారీ, టాటా ఏస్‌లో అక్రమంగా తరలిస్తున్న 28.8 టన్నుల రేషన్ బియ్యాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం వేపలగడ్డకు చెందిన బానోతు కోటేష్, ఇల్లెందుకు చెందిన లారీ డ్రైవర్ సంతోష్, టాటా ఏస్ డ్రైవర్ భూక్యా నాగరాజు కలిపి రెండు వాహనాల్లో 28.8 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమవారం తెల్లవారుజామున ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు తరలిస్తున్నారు. ఈ విషయంపై అందిన సమాచారంతో ఖమ్మం టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు తనిఖీలు చేపట్టి లలితాపురం సమీపంలో పంతుల్‌నాయక్ తండా వద్ద వాహనాలను అడ్డుకున్నారు. ఈమేరకు రేషన్ బియ్యంతో సహా వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ ఎస్.రాజారాం తెలిపారు.

అందరికీ సంక్షేమ పథకాలు అందాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ద్వారా సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. దర్బార్‌లో ఎక్కువ శాతం దరఖాస్తులు పోడు భూముల పట్టాలు, భూ, వ్యక్తిగత సమస్యలు, పంట పొలాలకు సోలార్ విద్యుత్ కనెక్షన్, ట్రైకార్ రుణాలు, మత్స్యకార సొసైటీలకు అనుమతి, వ్యవసాయ విద్యుత్, బోరు, మోటారు, గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం, ఉపాధి శిక్షణ, వైద్యానికి ఆర్థికసాయం తదితర సమస్యలపై వచ్చాయని వివరించారు. అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు మణెమ్మ, రవీంద్రనాథ్, భాస్కరన్, మునీర్ పాషా, లక్ష్మీ నారాయణ, ఉదయ్ కుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ అటవీ శాఖ అధికారుల పర్యటన



మనుబోతులగూడెంలో ఛత్తీస్‌గఢ్ ఎఫ్ఆర్ఓలు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మనుబోతులగూడెం గ్రామాన్ని ఛత్తీస్‌గఢ్ అటవీ శాఖ అధికారులు సందర్శించారు. ఇటీవల ఫారెస్ట్ రేంజ్ అధికారులుగా నియమితులైన 20 మంది బృందం సోమవారం ఇక్కడ పర్యటించగా... వలస ఆదివాసీ గిరిజనులకు అడవుల నరికివేతతో ఎదురయ్యే ఇక్కట్లను వివరించారు. ఆతర్వాత అటవీ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ప్లాంటేషన్‌ను పరిశీలించి పలు అంశాలపై స్థానిక అధికారుల సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఎఫ్ఆర్ఓ ఉపేందర్, సెక్షన్ ఆఫీసర్ నాగరాజుతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.